దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

- ఏళ్ల నాటి అటవీ సాగు భూముల సమస్యకు పరిష్కారం
- 1,606 ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పత్రాల పంపిణీ
- గిరిజన లబ్ధిదారులకు వైఎస్సార్ రైతు భరోసా సాయం


గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీశాఖ భూములు ఇవే..


అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు (ఆర్వోఎఫ్ఆర్) ఇవ్వడంతో గిరిజన గ్రామాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అనకాపల్లి జిల్లాలోనే అధికంగా నర్సీపట్నం నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు ఉన్నాయి. నాతవరం మండలంలో సరుగుడు సుందరకోట, కె.వి. శరభవరం, చమ్మచింత, మాధవనగరం పంచాయతీల పరిధిలో 25 గ్రామాలు 1/70 యాక్టు 5వ షెడ్యూలు పరిధిలో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో గిరిజనులు స్వాతంత్ర్యం రాకముందు నుంచి కొండ పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆనాటి నుంచి అటవీ భూములకు సాగు హక్కు పత్రాల కోసం ఆందోళనలు చేస్తున్నారు. 2005లో అటవీ హక్కు చట్టం ప్రకారం మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజనుల సాగు భూములకు ఆర్వోఎఫ్ఆర్ ఇచ్చారు. మైదాన ప్రాంతంలో భూములు సాగు చేసే గిరిజనులకు ఎలాంటి హక్కులు రాలేదు. ఈ నేపథ్యంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర గిరిజన అభివృద్ధి సలహా కమిటీలో సభ్యుడిగా నియమించారు. దాంతో నియోజకవర్గంలో పోడు సాగు చేసుకునే గిరిజనులందరికీ హక్కు పత్రాల కోసం డిమాండ్ చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని సరుగుడు అసనగిరి పంచాయతీలో మొదటి విడత కింద 412 మందికి 1,050 ఎకరాలకు, రెండో విడత కింద 233 మందికి 556 ఎకరాలకు అటవీహక్కు పత్రాలు పంపిణీ చేశారు. మొదటి విడత కింద అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజనులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తింపజేశారు. గొలుగొండ మండలంలో అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ ముందు అటవీ హక్కు పత్రాలు పొందిన సరుగుడు అసనగిరి, తొరడ, దద్దుగుల, కొత్త సిరిపురం, ముంత మామిడిలొద్దు, బమ్మిడికలొద్దు, రాజవరం, యరకంపేట, మాసంపల్లి, అచ్చంపేట, రామన్నపాలెం, పాత సిరిపురం గ్రామాల్లో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో భూములు లాక్కునే ప్రయత్నం

గిరిజనులు సాగు భూములను 2015లో టీడీపీ ప్రభుత్వం తీసుకునేందుకు ఏర్పాట్లు చేసింది. విశాఖపట్నం నడిబొడ్డున అటవీశాఖ భూమి తీసుకుని, దానికి బదులుగా సరుగుడు ప్రాంతంలో గిరిజనులు సాగు చేసుకునే వేల ఎకరాలు ఇవ్వడానికి సర్వే ప్రారంభించింది. అప్పట్లో గిరిజనులంతా రాజకీయాలకు అతీతంగా అడ్డుకున్నారు. దాంతో ఆ ప్రయత్నం విరమించుకుంది. ఆయా భూములను వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక సర్వే చేసి అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తోంది.

అర్హత ఉన్న అందరికీ ఇస్తాం



నిబంధనల ప్రకారం గిరిజనులు సాగు చేసుకునే రైతులందరికీ అటవీ హక్కు పత్రాలు ఇస్తాం. మొదటి విడతలో హక్కు పత్రాలు పొందిన గిరిజనులకు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తున్నాం.

– పి. కనకారావు, తహసీల్దార్

సీఎం, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటాం



సరుగుడు సుందర కోట పంచాయతీలో గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. నన్ను గెలిపించిన ఈ ప్రాంత గిరిజనులకు ఏళ్ల నాటి కల నెరవేర్చారు. అర్హత ఉండి మిగిలిపోయిన వారికి హక్కు పత్రాలు ఇవ్వడానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు,

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం మండలం

టీడీపీ సానుభూతిపరులకు రైతు భరోసా



మా గ్రామంలో టీడీపీ సానుభూతిపరులకు సైతం అటవీ హక్కు పత్రాలతోపాటు రైతు భరోసా సాయం వచ్చింది. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఆమోదం ఉంటేనే సంక్షేమ పథకాలు వచ్చేవి. నేను బతికి ఉండగా అటవీ హక్కు పత్రాలు చూస్తాననుకోలేదు. 40 ఏళ్లుగా ఐటీడీఏ పాడేరు, విశాఖ వెళ్లి ఉద్యమాలు చేశాం. సీఎం, ఎమ్మెల్యే చేసిన మేలు జీవితంలో మరిచిపోలేను.

– బండి గంగరాజు, గిరిమిత్ర స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి

సుదీర్ఘకాల రాజకీయంలో ఏం వెలగబెట్టారు?


అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

టీడీపీ కౌన్సిలర్లను నిలదీసిన పాలకపక్ష కౌన్సిలర్లు

నర్సీపట్నం: సుదీర్ఘకాలంపాటు రాజకీయం వెలగబెట్టి, ఇప్పుడు మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైయిన్లు లేవని మాట్లాడటం సిగ్గుచేటని టీడీపీ కౌన్సిలర్లను పాలకపక్ష కౌన్సిలర్లు నిలదీశారు. చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం పర్యటనకు రూ.12 లక్షలు ఖర్చు అయినట్లు ఎజెండాలో చేర్చడంపై టీడీపీ కౌన్సిలర్ సీహెచ్ పద్మావతి అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వార్డులో డ్రైనేజీ, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం పర్యటన పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయటం సరికాదన్నారు. దీంతో అధికార పక్ష కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కోనేటి రామకృష్ణ, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు కల్పించుకుని రోడ్లు, డ్రైయిన్లు లేవని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్లపాటు రాజకీయంలో ఏం చేశారని పద్మావతిని నిలదీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో నర్సీపట్నానికి రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి సమకూరితే, చంద్రబాబు హయాంలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దాంతో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు సీఎం రావటాన్ని హర్షించకపోగా, విమర్శలు చేయడం టీడీపీ కౌన్సిలర్లకు తగదన్నారు. సీఎం సభకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలకు మున్సిపాలిటీ నిధులతో సౌకర్యాలు కల్పించామన్నారు. ఇవి దుర్వినియోగం చేసే ప్రసక్తి లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కౌన్సిలర్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఎం రాకతో నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణకు రూ.16.84 కోట్లు మంజూరు చేశారన్నారు. వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కమిషనర్ కనకారావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం అడ్డగిస్తున్నారని నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న రాజులమ్మ కుటుంబీకులు

మాకవరపాలెం: ఇంటి నిర్మాణాన్ని అడ్డగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గిడుతూరు గ్రామానికి చెందిన మట్ల రాజులమ్మ కుటుంబీకులు నిరసన చేపట్టారు. ఇక్కడ తమ స్థలంలో కమ్మల ఇంటిని తొలగించి, దాని స్థానంలో పక్కా ఇల్లు నిర్మించుకుంటుంటే స్థానికంగా కొందరు అడ్డగిస్తున్నారని బాధితులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంట సామగ్రితో బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగ దిక్కులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ ప్రసాదరావుకు విన్నవించామని, అడ్డుకున్న వారిని పిలిపించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఇక్కడ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తూర్పుకాపు సంక్షేమానికి పాటుపడదాం


మాట్లాడుతున్న జగన్నాథరావు రాజారామ్

మాడుగుల: మండలంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం అభివృద్ధికి సంఘ సభ్యులు రాజకీయాలకు అతీతంగా ఏకతాటి మీదకు రావాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు భీముని జగన్నాథరావు కోరారు. మంగళవారం మాడుగులలో సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలన్నారు. సంఘ నాయకులు దంగేటి సూర్యారావు, పుప్పాల అప్పలరాజు, తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఊడి అప్పారావు, సభ్యులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, జవ్వాది వరహాలు, కోట్ని శ్రీరాంమూర్తి, పల్రె రామునాయుడు, పాము వెంకటరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ విభీషణరావు, ఆదిమూర్తి

రావికమతం: కొత్తకోటలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్లబళ్ల పోటీలు మంగళవారం ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 11 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. వీటిని ఎస్ఐ విభీషణరావు, జెడ్పీటీసీ భర్త ఆదిమూర్తి ప్రారంభించారు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు.

నేడు చీడికాడ అభయాంజనేయ తీర్థం

చీడికాడ: స్థానిక అభయాంజనేయ స్వామివారి తీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఆనందబాబుకు వైఎస్సార్‌సీపీ నేతల అభినందన


ఆనందబాబును సన్మానిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబును వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల ఆడారి తులసీరావు మృతితో అతని కుమారుడు ఆనందబాబు విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, మండల సర్పంచ్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు మరిసా నాని, దేవర అప్పారావు, మండల కాపు సంఘం, యాదవ సంఘం అధ్యక్షులు ముచ్చకర్ల అప్పారావు, నమ్మి అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల సంఘం అధ్యక్షులు, రైతు సంఘ నాయకులు, కన్వీనర్లు కలిసి సత్కరించారు.

కె.జె.పురంలో పౌరహక్కుల దినోత్సవం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో పౌర హక్కులు దినోత్సవం మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఎంపీడీవో పి.ఎస్.ఎల్.ఎస్. మీనాకుమారి మాట్లాడుతూ దిశ యాక్టు గురించి వివరించారు. గ్రామంలో అంటరానితనం పాటిస్తున్నారా అని ప్రశ్నించగా, అటువంటి సమస్య లేదని కాలనీ ప్రజలు సమాధానమిచ్చారు. సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, హాస్టల్ సంక్షేమ అధికారి రమణ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సామాజిక హక్కులపై అవగాహన

మాకవరపాలెం: సామాజిక హక్కులపై అవగాహన అవసరమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ సూచించారు. బయ్యవరంలోని దళితవాడలో మంగళవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ ప్రసాదరావు, సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

కె.జె.పురంలో సందడిగా గాంధీ తీర్థం


కె.జె.పురంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు

మాడుగుల రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ తీర్థం మంగళవారం కె.జె.పురంలో ఘనంగా నిర్వహించారు. ఏటా గాంధీ వర్ధంతి మరుసటి రోజు ఈ తీర్థం నిర్వహించడం పరిపాటి. ఈ సందర్భంగా గాంధీ వీధిలో గాంధీ విగ్రహానికి సర్పంచ్ జామి రమణబాబు, పాలకవర్గ సభ్యులు, వీధి వాసులు, నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కబడ్డీ, ముగ్గులు, సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. దాడి రాము సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, నేతలు కాళ్ల అప్పలనాయుడు, ఆడారి కన్నారావు, మళ్ల కన్నబాబు, కాళ్ల జగన్, ఎం.వి.సత్యనారాయణ, బి. జగ్గారావు, ఎ. గణేశ్, పెంటయ్య, కె. రఘుకుమార్, రాపేట గోవింద, అమ్మతల్లినాయుడు మాస్టరు, మాలినాయుడు, గాంధీ, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ పాల్గొన్నారు.

భారత నిర్మాణ సేవా ట్రస్టుకు పురస్కారం

- మాడుగుల గ్రామస్తులు హర్షం


భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యుడు మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల: మహనీయుడు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని మాడుగులలో పదేళ్లుగా భారత నిర్మాణ సేవా ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలు గుర్తించి విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ వారు ఈ నెల 29న హైదరాబాద్‌లో వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు ప్రదానం చేశారు. దేశం మొత్తమ్మీద 3 వేల దరఖాస్తులు వెళ్లగా, 30 ట్రస్టులకే అవార్డులు ప్రదానం చేయడం విశేషం. ఈ మేరకు మాడుగులలో మంగళవారం భారత నిర్మాణ ట్రస్టు సభ్యుడు గౌరీపట్టపు మహేష్ కుమార్‌ను గ్రామస్తులు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ట్రస్టు సభ్యులు ముప్వా బుచ్చయ్యచౌదరి, మట్టా సాయి కుమార్, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, కుక్కర మోదకొండ,ఎ బలరామ్ పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు అన్ని విధాలుగా మేలు


గునుపూడిలో డ్రోన్ ఎగురవేస్తున్న అధికారులు

నాతవరం: భూములు రీసర్వే చేయడం ద్వారా రైతులకు అన్ని విధాలుగా మేలు కలుగుతుందని సర్పంచ్ వేముల సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పోలువర్తి వెంకటరమణ తెలిపారు. గునుపూడిలో రెవెన్యూ అధికారులు మంగళవారం రీసర్వే చేసేందుకు ముందుగా డ్రోన్ ఎగురవేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న రీసర్వేపై అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. రీసర్వే చేసేటప్పుడు రైతులంతా ఐక్యంగా సహకరిస్తే వేగవంతం అవుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శరభవరంలో డ్రోన్ సర్వే

రోలుగుంట: శరభవరంలో డ్రోన్ సర్వేను తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రెవెన్యూలో 218 సర్వే నంబర్లలో 1,230 ఎకరాల విస్తీర్ణం భూమిని సర్వేయర్ తవుటనాయుడు ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సర్వే వల్ల రైతులు భూముల గట్లు, సరిహద్దులు కచ్చిత పద్ధతిలో నమోదవుతాయని, దీనివల్ల దీర్ఘకాలిక భూసమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం


రాచపల్లిలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఈఈ నాగేశ్వరరావు

మాకవరపాలెం: జల్ జీవన్ మిషన్‌లో చేపట్టిన ఇంటింటా కుళాయి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని రాచపల్లి, కొండలఅగ్రహారం, గిడుతూరు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులతోపాటు సచివాయాల పరిధిలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ వేసవిలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని ఆదేశించారు. నర్సీపట్నం డీఈ ప్రభాకరరావు, స్థానిక ఏఈ శివారెడ్డి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం


సౌజన్యను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు

కె.కోటపాడు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు స్వీకరించిన సౌజన్యను గుల్లేపల్లి సర్పంచ్ బండారు దేముళ్లు ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక సచివాలయంలో ఆమెకు దుశ్శాలువా వేసి జ్ఞాపిక అందించి సత్కరించారు. ప్రభుత్వ లక్ష్యాలను గ్రామస్థాయిలో అర్హులకు అందించడంతోపాటు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చేస్తున్న సేవలను ప్రశంసించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

చీడికాడ: బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యుడు పి.అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం తురువోలులో స్వాభిమాన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతులిత ఆహారం తీసుకోవడం, పిల్లల ప్రవర్తనలో మార్పులుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీ, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తలుపుతల్లి పండగ

గొలుగొండ: ఏటిగైరంపేటలో తలుపుతల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అమ్మవారిని దర్శించుకోవడం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కానుకలు సమర్పించుకున్నారు. చింతపల్లి, గొలుగొండ, నర్సీపట్నం మండలాల నుంచి వందలాది మంది భక్తులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి దేవీతల్లి తీర్థం

వాల్‌పోస్టర్ విడుదల చేసిన డిప్యూటీ సీఎం బూడి


దేవి తీర్థం వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరి దేవి(తీర్థ) కల్యాణ మహోత్సవాల వాల్ పోస్టర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ఆయన్ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. తొలి రోజు బుధవారం భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమై ఈ నెల 5వ తేదీతో ముగిస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితా ప్రసాద్, గుండు రాంబాబు, వెత్సా రమేష్, దీవి శంకర్, వాలేటి నాగరాజు, వేచలపు అప్పలనాయుడు, పరవాడ రవి, రైవాడ మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, చల్లా నాయుడు పాల్గొన్నారు.

5న దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పునఃప్రారంభం

ఆధునికీకరించిన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఈ నెల 5వ తేదీన పునః ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సూచించారు. ఈ పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. పక్కా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో భవన నిర్మాణ పనులను పరిశీలించి, స్థానిక మండల ఇంజినీర్ ఉమామహేశ్వరరావుకు పలు సూచనలు చేశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన రాష్ట్ర స్త్రీనిధి అధ్యక్షురాలు

రాష్ట్ర స్త్రీనిధి అధ్యక్షురాలిగా నియమితులైన కె.కోటపాడు మండలానికి చెందిన బి. జయలక్ష్మి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిసింది. రైవాడ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేసింది. కె.కోటపాడు వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) ఏపీఎం పి.వి.లక్ష్మి, సీసీలు ఇ. వెంకటరావు, డి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఎఫ్ ఆవుల కొనుగోలుకు రుణాలు


మాట్లాడుతున్న డీఎం పాండ్యన్‌రాజన్

మాకవరపాలెం: విశాఖ డెయిరీ ద్వారా పాడి రైతులకు రూ.50 వేల రుణం ఇచ్చి కర్ణాటకకు చెందిన హెచ్‌ఎఫ్ ఆవులను అందజేయనున్నారు. వీటితోపాటు రవాణా, ఇన్సూరెన్స్ ఖర్చులను డెయిరీ భరిస్తుందని డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు జంగాపల్లి, పి.పి.అగ్రహారంలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెయిరీ డిప్యూటీ మేనేజర్ పాండ్యన్‌రాజన్ మాట్లాడుతూ కోలార్‌కు చెందిన ఆవుల పోషణ, లేగదూడల సంరక్షణ, దాణా విషయాలను వివరించారు. నర్సీపట్నం యూనిట్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బోరు పనులకు పూజలు

మాడుగుల: స్థానిక సచివాలయం -1 వద్ద తాగునీటి బోరు పనులకు ఎంపీపీ వేమవరపు రామధర్మజ మంగళవారం ఉదయం భూమిపూజ చేసి ప్రారంభించారు. సచివాలయ పనులు పూర్తి కావడంతో తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, జవ్వాది వరహాలు, శీలామంతుల వాసు, సమ్మంగి జగన్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి 1,262 కొత్త పుస్తకాలు

నర్సీపట్నం: వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన 1,262 కొత్త పుస్తకాలను ప్రభుత్వం స్థానిక గ్రంథాలయానికి సరఫరా చేసినట్లు గ్రంథాలయ అధికారి పి.దమయంతి తెలిపారు. మంగళవారం పాఠకుల ముందు వీటిని ప్రదర్శించారు. వీటిలో తెలుగు 1,072, ఇంగ్లిష్ 141, హిందీ 49 పుస్తకాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ



కె.కోటపాడులో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఈవోపీఆర్డీ ప్రసాద్

కె.కోటపాడు: ప్రాథమిక దశలోనే కుష్టువ్యాధిని గుర్తించి వైద్యం అందించడం వల్ల శాశ్వతంగా నివారించొచ్చని ఈవోపీఆర్డీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కె.కోటపాడులో హైస్కూల్ విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధికి సంకేతాలు అన్నారు. అనుమానిత మచ్చలను వైద్య సిబ్బందికి చూపించుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శర్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఏఎన్ఎం నళిని పాల్గొన్నారు.

మోదకొండమ్మ తీర్థం పోస్టరు విడుదల

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో ఈ నెల 5న నిర్వహించే మోదకొండమ్మ తీర్థం వాల్ పోస్టరును మంగళవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా తీర్థానికి కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు గొల్లవిల్లి సత్యారావు, చింతల వెంకటనారాయణమూర్తి, పడాల అప్పలరాజు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ


సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు చెక్కు అందిస్తున్న అప్పారావు

కె.కోటపాడు: ఎ.భీమవరం పాల సంఘం సభ్య రైతులు 202 మందికి బోనస్ మంజూరైనట్లు సంఘం అధ్యక్షుడు తాడి శ్రీనివాసరావు తెలిపారు. బోనస్ కింద రూ.2.33 లక్షల చెక్కును మంగళవారం ఆయనకు ఏరియా మేనేజర్ అప్పారావు అందించారు. సంక్రాంతి పండగతోపాటు గ్రామ తీర్థానికి రెండు మార్లు బోనస్ అందించేందుకు సహకరించిన డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సూపర్‌వైజర్ చక్రి, వేతన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.